క్లుప్తంగా

నేడు కొంగనపల్లిలో గడప గడపకు..

రామకుప్పం: మండలంలోని కొంగనపల్లి పంచాయతీ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పాల్గొంటారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొనాలని కోరారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

బైరెడ్డిపల్లి: గర్భిణులు తప్పనిసరిగా మంచి పోషకాహారం తీసుకోవాలని.. అప్పుడే తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉంటారని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. మండలంలోని పాతపేటలో గురువారం వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితమన్నారు.

ప్లానింగ్ సెక్రటరీలకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ప్లానింగ్ సెక్రటరీలకు ప్రభుత్వం నుంచి అందిన ట్యాబ్‌లను మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. రీసర్వే కోసం ట్యాబ్‌లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని ఆమె తెలిపారు.

కౌండిన్యలో ఇసుక తవ్వకాలను అరికట్టండి

పలమనేరు: పెద్దపంజాణి మండలం అప్పినపల్లి వద్ద కౌండిన్య నదిలో యథేచ్ఛగా జేసీబీ వాహనాలను పెట్టి ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు గురువారం ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు.

చదువులో పోటీపడితేనే ఉత్తమ మార్కులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శాంతిపురం: తోటి విద్యార్థుల మధ్య చదువులో పోటీ ఉంటే ఉత్తమ మార్కులు సాధించవచ్చని రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మోడల్ స్కూలులో ఉత్తమ ప్రతిభ చూపిన హారిక, అనుష్క, పవన్‌కుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, సర్పంచ్ చంగమరాజు, ప్రిన్సిపల్ లత, ఎస్‌ఈసీ చైర్మన్ మంజునాథ్, చలపతి, అప్పిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు అభినందన



మొదటి తరగతికి వెళుతున్న పిల్లలతో అంగన్‌వాడీలు

పలమనేరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుని ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు వెళుతున్న పిల్లలకు అభినందనలు తెలుపుతూ గురువారం జగభాగిదారి కార్యాక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు ర్యాలీ చేశారు. బాగా చదువుకుని మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు నయాజ్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

'స్మార్ట్ టికెట్' విధానంలో నిర్లక్ష్యమేల?

చిత్తూరు రూరల్: స్మార్ట్ టికెట్ విధానంలో నిర్లక్ష్యం ఎందుకని డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని ఓ ప్రయాణికుడు గురువారం యూటీఎస్ (యూనిఫైడ్ టికెట్ సొల్యూషన్) విధానం అమలు చేయడం లేదని బస్టాండులోని డీపీటీఓను ఆయన కార్యాలయంలో కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీనిపై ఆయన స్పందించి అధికారులతో మాట్లాడారు. విధిగా నిర్ణీత బస్సుల్లో యూటీఎస్ విధానం అమలు చేయాలని ఆదేశించారు. ఆ విధానంలో టికెట్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, జీ పే, ఫోన్ పే తదితర విధానాల్లో నగదు చెల్లిస్తే టికెట్లు ఇవ్వాలన్నారు. మళ్లీ ఇలాంటి ఫిర్యాదులు రాకూడదని ఆయన హెచ్చరించారు.

పేరు ఏమార్చి

ఉప్పు కప్పురంబు ఒక్కపోలికనుండు చూడ చూడ రుచులు జాడ వేరు.. ఈ వేమన పద్యం పలమనేరులో మినరల్ వాటర్ బాటిళ్ల దందాకు అతికినట్లు సరిపోతుంది. చూడ్డానికి బ్రాడ్ వాటర్ బాటిల్ లాగే కనిపించినా సరిగ్గా పరిశీలిస్తే నకిలీ గుట్టు బయటపడుతుంది. ఉదాహరణకు ప్రముఖ బ్రాడ్ కిన్లీ పేరు కనిపించేలా స్పెల్లింగ్ మార్చి కైన్‌లే, కాన్లే తదితర పేర్లతో విక్రయిస్తున్నారు. అలాగే బిస్లరీ ఒరిజినల్ బ్రాండ్‌ను బ్రూక్‌లిన్, బెల్‌స్రీ, బిల్‌సిరి, బిసలరీ, బ్రిస్లీగా మార్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలియని చాలామంది ఇది అసలైందే అనుకుని కొని తాగుతున్నారు.

- నాణ్యత ప్రమాణాలకు పాతరేసిన వాటర్‌ప్లాంట్లు
- నీటి బాటిళ్లపై కనిపించని ఐఎస్‌ఐ మార్కు
- ప్రముఖ బ్రాండ్లకు దగ్గరగా ఉండేలా పేర్లు
- ప్రజల ఆరోగ్యంతో చలగాటమాడుతున్న వైనం

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో మినరల్ వాటర్ బాటిళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రజలు సైతం మినరల్ వాటరంటూ ఈ నీళ్లకే అలవాటు పడ్డారు. దుకాణాలు, హోటళ్లు, దాబాల్లో సాధారణ నీటికి బదులు మినరల్ వాటర్‌నే విక్రయిస్తున్నారు. కానీ ఈ బాటిళ్లను తయారుచేసే నిర్వాహకులు ఐఎస్‌ఐ నాణ్యత ప్రమాణాలను ఏమాత్రం పాటించకుండా రకరకాల బ్రాండ్ల పేరుతో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. దుకాణదారులు సైతం ఈ నకిలీ బ్రాండ్లు తక్కువ ధరకే లభిస్తున్నందున వీటని కొని జనానికి తాపిస్తున్నారు. వాటర్‌ప్లాంట్లు, ఇళ్ల వద్దే నీటిని విక్రయించే ట్యాంకు ఆటోలు పట్టణాలతో పాటు పల్లెల్లోనూ పెరిగాయి. ప్రజల అలవాటును గమనించి కొందరు నిబంధనలకు విరుద్ధంగా వాటర్‌ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. వీటిల్లో దేనికి ఐఎస్‌ఐ ఉందో దేనికి లేదో కూడా తెలియని అయోమయం నెలకొంది. సాధారణ నీటినే ట్యాంకర్లతో తెచ్చి మినరల్ వాటర్ అనిచెప్పి ఏమార్చేస్తున్నారు. విధిలేక ఈ నీటినే జనం కొనాల్సి వస్తోంది. ఫలితంగా జలుబు, గొంతునొప్పి లాంటి సమస్యలు తప్పడం లేదు.

చిన్నపాటి స్పెలింగ్‌ను మార్చి ఏమార్చుతూ....

మినరల్ వారట్ బ్రాండ్ అయిన కిన్‌లే పేరు కనిపించేలా స్పెల్లింగ్ మార్చి కైన్‌లే, కాన్లే తదితర పేర్లతో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. బిసెలరీని బ్రూక్‌లిన్, బెల్‌స్రీ, బిల్‌సిరి, బిసలరీ, బ్రిస్లీగా మార్చి విక్రయిస్తున్నారు. అక్వాఫినాకి బదులు ఆక్వాపినా, ఆక్వాపిన్ లాంటి పేర్లను వాడుతున్నారు.

నిబంధనలకు నీళ్లు

పలమనేరు డివిజన్‌లో వందకుపైగా మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయి. వీటి నుంచి నీటిని క్యాన్లకు రీటైల్‌గా విక్రయిస్తున్నారు. వాటర్‌ప్లాంట్లు లేకనే కొందరు బోర్లలో నీటిని నింపి మినరల్ వాటర్ పేరిట విక్రయించే ట్యాంకర్లు వందకుపైగా ఉన్నాయి. నీటి నాణ్యత గురించి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వీరు విక్రయించే నీళ్లను జనం తాగి ఇబ్బందులు పడుతున్నారు. అక్రమ వాటర్‌ప్లాంట్ల వ్యవహారాన్ని తేల్చాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్, ఆహారకల్తీ నిరోధకశాఖ, ఫుడ్ కంట్రోలర్‌లు, మున్సిపాలిటీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకున్న దాఖలాలు లేవు.







బిస్లరీలా కనిపించే బెర్‌సిలి, కిన్లీ లాంటి కిల్బీ, ఆక్వాఫినాలా ఉన్న ఆక్వాకేర్

మున్సిపల్ కౌన్సిల్‌లో తెరపైకొచ్చినా..

గతంలో జరిగిన మున్సిపల్ సమావేశంలో పట్టణంలో సాగుతున్న అక్రమనీటి వ్యాపారంపై పాలకమండలి ఆగ్రహం వ్యక్తం చేసింది. సంబంధిత శాఖల ద్వారా తనిఖీలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర కమిషనర్ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. చర్యలు తీసుకుంటామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు.

నిబంధనలు ఇలా..

మామూలుగా ఎవరైనా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలంటే తొలుత బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)కు దరఖాస్తు చేసుకోవాలి లేదా ఐఎస్‌ఐ (ఇండియన్ స్టాండర్డ్ ఇన్‌స్టిట్యూషన్) ద్వారా అనుమతి పొందాలి. ముంబై, చెన్నైలకు చెందిన ఈ సంస్థలు తమ బృందాన్ని పంపి నీటి నాణ్యత ప్రమాణాలపై తనిఖీలు నిర్వహిస్తుంది. బోరు పాయింట్ నుంచి వచ్చే నీళ్లను ల్యాబ్‌కు పంపి అన్ని రకాల పరీక్షలు జరుపుతుంది. ఆపై అనవసర లవణాలను తీసివేసి ఆరోగ్య దాయకంగా నీటిని తయారు చేయాల్సి ఉంటుంది. అన్ని సంతృప్తి కరంగా ఉంటే ఐఎస్‌ఐ సర్టిఫికెట్లను జారీ చేస్తుంది. అనుమతి, స్ట్రక్చర్ తదితరాలను మాత్రం సంబంధిత పంచాయతీలు, మున్సిపల్ అధికారులు పరిశీలిస్తారు. ఈ తతంగమంతా ఇక్కడి వాటర్‌ప్లాంట్‌లలో కనిపిస్తే ఒట్టు. మరికొందరు చెన్నైలోని బయోహెర్బల్ సంస్థ నుంచి తూతూమంత్రంగా సర్టిఫికెట్లను తెచ్చుకొని వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

ఎక్కడ చూసినా డూప్లికేట్ బాటిళ్లే..



పట్టణంలో ఎక్కడ చూసినా డూప్లికేట్ నీళ్ల బాటిళ్లు కనిపిస్తున్నాయి. ఇవేం కంపెనీలు అని విక్రయించేవారినడిగితే ఎవరో ఏజెన్సీ వాళ్లు ఇచ్చారనే సమాధానం వస్తోంది. ఇలాంటి నీటిని తాగితే ఆరోగ్య సమస్యలు తప్పవు. దీనిపై జిల్లా ఆహారకల్తీ నిరోధకశాఖ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నాం.

– నరసింహులు, పలమనేరు పరిరక్షణ సమితి కార్యదర్శి

చర్యలు తీసుకునేలా చూస్తాం



బయటి నుంచి వచ్చే నకిలీ వాటర్ బాటిళ్లపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పట్టణ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వాటర్‌ప్లాంట్‌ల వ్యాపారంపై గతంలో పలవురు కౌన్సిలర్లు మున్సిపల్ మీట్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోమని చెప్పాం. మరోసారి ఈ వ్యవహారంపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకొనేలా చూస్తాం.

– పవిత్ర, మున్సిపల్ చైర్‌పర్సన్, పలమనేరు

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

పుంగనూరు: పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో బహుమతులు సాధించిన విద్యార్థులకు గురువారం ప్రశంసాపత్రాలు అందజేశారు. గ్రంథాలయాధికారులు రాజు, నసీబ్‌జాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు వెంకటపతి, గంగులమ్మ లీనార్డ్ హైస్కూల్, బసవరాజ హైస్కూల్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, విరామం దొరికినప్పుడల్లా పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరాములురెడ్డి, సలీంమాలిక్, పద్మావతమ్మ పాల్గొన్నారు.

సమస్యలపై అంగన్‌వాడీల నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పలమనేరు: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు అంగన్‌వాడీలు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. సమస్యల సాధన కోసం జూలై 10వ తేదీ కలెక్టరేట్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంఘం నాయకులు గంగరాజు, శ్యామల, అనిత తదితరులు పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి

పుంగనూరు: మార్కెట్ కమిటీలో రైతులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ఆదుకుంటామని నూతన ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి తెలిపారు. గురువారం ఏఎంసీ ఆవరణలో నూతన పాలకమండలి తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి సహకారంతో మార్కెట్ కమిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. చింతపండు వ్యాపారుల కోసం వ్యాపార సముదాయాలు నిర్మించామన్నారు. అలాగే రైతుల కోసం షెడ్లు నిర్మించి వారికి తాగునీటి వసతి ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు తీసుకొచ్చే పంటకు గిట్టుబాటు ధర లభించేందుకు వీలుగా దళారి వ్యవస్థను పూర్తిగా అరికడతామన్నారు. మార్కెట్ కమిటీలో ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి మార్కెట్ కమిటీకి ఆర్థిక వనరులుగా మార్చుతామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, నాయకులు కొత్తపల్లి చెంగారెడ్డి, చంద్రారెడ్డి యాదవ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ మూతతో అవస్థలు



మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం వద్ద వేచి ఉన్న స్థానికులు

శాంతిపురం: చెంగుబల్ల పంచాయతీలోని సోగడబల్లలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం తరచూ మూతపడుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేంద్రంలో 11 మంది గర్భిణులు, 28 మంది పిల్లలు, ఆరుగురు బాలింతలు ఉన్నారు. అంగన్‌వాడీ వర్కర్, ఆయా ఉన్నప్పటికీ కేంద్రం పని చేయకపోవడంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కూడా సక్రమంగా అందడం లేదు. దీనిపై ఐసీడీఎస్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని స్థానికులు వాపోయారు. గురువారం కూడా అంగన్‌వాడీ కేంద్రం తెరుచుకోకపోవడంతో అక్కడికి వచ్చిన బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడ్డారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోయినా స్పందన లేకపోయిందని స్థానిక సర్పంచ్ పూలకుంట భాస్కర్ తెలిపారు. వివరణ కోసం ఐసీడీఎస్ సీడీపీఓ కల్పనను సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

విద్యా కానుక కిట్లు పంపిణీ

రామకుప్పం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం జగనన్న విద్యా కానుక కిట్లను జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా పోటీ పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, నాయకులు చంద్రారెడ్డి, అప్పి, పాఠశాల హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు.



కిట్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బాల్య వివాహాలు చేస్తే జైలుకే



కిశోర బాలికలతో మాట్లాడుతున్న సీడీపీఓ

గంగవరం: బాల్య వివాహాలు చేస్తే జైలు శిక్ష తప్పదని ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరప్రియదర్శిని అన్నారు. మండలంలోని కీలపట్ల హైస్కూల్‌ని కిశోర బాలికలతో గురువారం సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఈ వివాహాలను ఎవరైనా ప్రోత్సహించినా శిక్షార్హులు అవుతారన్నారు. ఇళ్లలో పెద్దలు మైనర్ బాలికలకు వివాహం చేయాలని ఒత్తిడి తెస్తే ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. సూపర్‌వైజర్ గీతమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు, నాలుగేళ్ల డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లను పెట్టుకోవాలని సూచించారు. నూతన విద్యావిధానంలో భాగంగా బీకాం కంప్యూటర్స్, బీకాం జనరల్, బీబీఏ, బీఎస్సీ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బీఏ పొలిటికల్ సైన్స్, ఒకేషనల్ కోర్సుల్లో డైరీ టెన్నాలజీ, హార్టికల్చర్ ప్రధాన సబ్జెక్టులుగా ఉంటాయని తెలిపారు. బోటని, కంప్యూటర్ సైన్స్, హిస్టరీలను మైనర్ సబ్జెక్టులుగా ఎంచుకోవాలని సూచించారు. నాలుగేళ్ల డిగ్రీని ఆనర్స్‌గా పట్టా ఇస్తారని తెలిపారు. నాలుగేళ్లు డిగ్రీ చేసిన వారు పీజీ రెండో సంవత్సరంలో ప్రవేశానికి అర్హులుగా ఉంటారని తెలిపారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

- ప్రభుత్వ పాఠశాలల్లో తేడా గమనించారా
- నేడు సర్కారు బడుల్లో అడ్మిషన్లకు డిమాండ్
- చదువులో రాణిస్తున్న ఆణిముత్యాలను అభినందిద్దాం
- జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: ప్రతి పేదవాడు బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకుంటే ఆ కుటుంబంతో పాటు సమాజం బాగుపడుతుందని భావించి రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేసి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీ పాలనలో విద్యార్థులు లేక మూతబడిన బడులు, సౌకర్యాలు లేక బడికి రాని పిల్లలు, దీనావస్థగా మారిన సర్కారు చదువులను చూశామన్నారు. నేటి జగనన్న పాలనలో నాడు–నేడు ద్వారా కార్పొరేట్‌కు దీటుగా మారిన సర్కారు బడులు, పిల్లలకు జగనన్న కానుకలు, పౌష్టికాహారం, అమ్మఒడితో పేదరికానికి చదువు ఆటంకం కాదని నిరూపించారన్నారు. ఈ మార్పును ప్రజలు ప్రత్యక్షంగా వారి గ్రామాల్లోనే చూస్తున్నారని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమైన వారంలోనే అడ్మిషన్లకు ఉన్న డిమాండ్‌ను బట్టి సర్కారు బడులకు ఎలాంటి ఆదరణ లభిస్తుందో అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ మల్లిక, ఎంఈఓ లీలారాణి, ఎంపీడీఓ విద్యాసాగర్, నాయకులు రంగనాథం, మురళీకృష్ణ, చెంగారెడ్డి, ముజ్జు పాల్గొన్నారు.



పలమనేరులో విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలను అందిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ప్రతిభకు పురస్కారం

గంగవరం: మండలంలోని 16 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. గంగవరం పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చూపిన జ్వాల, స్నేహ, దినేష్‌లకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేశారు. అన్ని పాఠశాలల్లో మొత్తం 48 మంది విద్యార్థులకు రూ. 96 వేలు పంపిణీ చేశారు. నగదుతో పాటు ఉత్తీర్ణులైన ముగ్గురు విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు ఇచ్చారు. కల్లుపల్లి హైస్కూల్‌లో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద నగదు బహుమతులు పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

పెద్దపంజాణి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యం అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురికి జగనన్న ఆణిముత్యం పథకం ద్వారా మెడల్, ప్రశంసా పత్రంతో పాటు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు పంపిణీ చేశారు. సర్పంచ్ అఖిల జాఫర్, కోగిలేరు సర్పంచ్ రమేష్ బాబు, హెచ్‌ఎం దేవరాజులు, పీఎంసీ చైర్మన్ యాకూబ్ పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేత

రొంపిచెర్ల: మండలంలోని 8 ఉన్నత పాఠశాలల్లో 24 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. రొంపిచెర్ల బాలుర, బాలికల, ఉర్దూ, కేజీబీవీ పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.5 వేల చొప్పున సర్పంచ్ ఇబ్రహీంఖాన్ సొంత డబ్బులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, ఎంఈఓ హసన్‌బాషా, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, వైస్ ఎంపీపీ విజయశేఖర్, హెచ్‌ఎం తాతయ్య, లక్ష్మీదేవి, శ్రీనివాసులు, సరళ, నాగార్జున, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.



గంగవరంలో..



పెద్దపంజాణిలో విద్యా కానుకలు పంపిణీ చేస్తున్న నాయకులు



రొంపిచెర్లలో నగదు పురస్కారాలను అందజేస్తున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లకు డిమాండ్

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలతో ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లకు డిమాండ్ పెరిగిపోయిందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని కొత్తయిండ్లు హైస్కూల్లో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, ఎంఈవో కేశవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి జెడ్పీ చైర్మన్ హాజరై జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన 8 మంది విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణ పేద విద్యార్థుల తలరాతలు మార్చేలా జగనన్న పాలన సాగిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు కార్పొరేట్‌కు దీటుగా వసతులను కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని చెప్పారు. ప్రస్తుతం పాఠశాలల్లో అడ్మిషన్లకు క్యూలు కడుతున్నారని పేర్కొన్నారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పుంగనూరు నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తోపాటు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, హెచ్‌ఎం సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులు వీరే

పుంగనూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ కరీష్మ రూ.15 వేలు, కె.తస్మియా రూ.10 వేలు, బి.యశోద, పి.నాగతునుజకు రూ.5 వేలు చొప్పున నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇంటర్‌మీడియట్‌లో ఎం.లత, కె.పవిత్ర, కె.హేమశ్రీ, ఎం.యశోదకు ఒకొక్కరికి రూ.15 వేలు చొప్పున నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు.